క్లుప్తంగా

## ఊరెళ్తే ఠాణాలో సమాచారమివ్వాలి

చన్గోముల్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి



పూడూరు: పండగలకు ఊరెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని చన్గోముల్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సెలవుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో నగదు, నగలను బ్యాంకు లాకర్‌లోగాని రహస్య స్థలాల్లో భద్రపర్చుకోవాలని సూచించారు. సెక్యూరిటీ ఆలారం, సెంట్రల్‌ లాకింగ్‌ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో లేదా గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్‌ 100కు ఫోన్‌ చేయాలని అన్నారు. సీసీ కెమెరాలు ఉన్నవారు తరచూ ఆన్‌లైన్‌లో వీక్షించాలని సూచనలు ఇచ్చారు.

## క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



టాస్‌ వేస్తున్న నారాయణరెడ్డి

పెద్దేముల్‌: క్రీడలతోనే స్నేహభావం పెంపొందుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన క్రికెట్‌ టోర్నీని ఆయన ప్రారంభించారు. మారుమూల మండలంలో 30 టీంలు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, కిషన్‌రావు, ప్రకాశం, బాలప్ప, విద్యాసాగర్‌, నరేష్‌రెడ్డి, విఠల్‌, ప్రవీణ్‌కుమార్‌, నర్సిములు, చందర్‌నాయక్‌, ప్రసాద్‌, ఆర్గనైజర్లు రవికుమార్‌రెడ్డి, వెంకటేశ్‌, మతీన్‌, అఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కరీం

పరిగి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ కరీం సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘవపూర్‌ తదితర గ్రామాల్లో రూ.500 లకే గ్యాస్‌ సిలిండర్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. సబ్సిడీ గ్యాస్‌ సిలిండర్‌కు ఎంపికకాని వారు మండల పరిషత్‌ కార్యాలయంలో సంప్రదిస్తే పూర్తి వివరాలను తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయం



కోటబాసుపల్లిలో ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

తాండూరు రూరల్‌: ఉమ్మడి రాష్ట్రంలో హోం శాఖ మంత్రిగా పనిచేసిన ఇంద్రారెడ్డి పేదల పక్షపాతని నాయకులు కొనియాడారు. ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కోటబాసుపల్లిలో ఆయన విగ్రహానికి గ్రామనేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి కోటబాసుపల్లి అల్లుడు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆయన సేవలు చిరస్మరణీమన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, చందు, రాజు, రవి, బాల్‌రాజ్‌, శ్రీను, జగదీష్‌, బురోద్దీన్‌, రాజు, కల్యాణ్‌, రమేష్‌, అంజి, నర్సింలు, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

కుల్కచర్ల: పరిసరాల పరిశుభ్రతతో అనారోగ్య పరిస్థితులు దరిచేరవని కొత్తపల్లి హెల్త్‌ అసిస్టెంట్‌ విజయ పేర్కొన్నారు. శుక్రవారం చౌడాపూర్‌ మండలం కొత్తపల్లి గ్రామంలో ఆరోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్య, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు శుభ్రంగా ఉండటంతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పుష్పలత, రాములమ్మ, నర్సమ్మ, కమలమ్మ, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు అభివృద్ధికి మోక్షం

- హిందూ ఉత్సవ సమితి స్థలంలో నిర్మాణాలు
- రూ.50 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



భూమిని చదును చేస్తున్న యంత్రాలు

తాండూరు: ఎట్టకేలకు తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన స్థలంలో అభివృద్ధి పనులకు మోక్షం లభించింది. స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవతో రూ.50 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణ శివారులోని ఖాంజాపూర్‌ గుట్ట ప్రాంతంలో ఆరేళ్ల క్రితం హిందూ ఉత్సవ కేంద్ర సమితి, ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌లకు గత ప్రభుత్వ హయాంలో స్థలం కేటాయించారు. అయితే ముస్లిం వెల్ఫేర్‌ అసోసియేషన్‌కు కేటాయించిన స్థలంలో ఈద్గా, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకొని ఏటా పండగ రోజుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. ఈద్గా పక్కనే ఉన్న హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన భూమిలో ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదు. ఈ విషయమై సమితి ప్రతినిధులు అనేకసార్లు నిధులు మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులను కోరారు. కానీ ప్రయోజనం శూన్యం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన భూమిలో దేవాలయ నిర్మాణంతో పాటు పూజా కార్యక్రమాలు చేసుకునేందుకు అనువుగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్‌ ప్రకటించింది. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అక్కడ రూ.50 లక్షలు మంజూరు చేయించి నిర్మాణ పనులకు ఇటీవల భూమి పూజ చేసి ప్రారంభించారు.

### ప్రహరీ నిర్మాణం

హిందూ ఉత్సవ కేంద్ర సమితికి కేటాయించిన భూమిలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. మొదటగా గుంతలమయంగా ఉన్న భూమిని చదును చేస్తున్నారు. తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కేటాయించిన నిధులతో ప్రహరీ గోడ నిర్మాణ పనులను చేపట్టనున్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో వినాయక, సరస్వతి అమ్మవార్ల దేవాలయాలతో పాటు పలు ఆలయాలను నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు భక్తులు యాగాలు, హోమాలు చేసుకునేందుకు అనువుగా యాగశాల, 500 మందికి సరిపడా గిడ్డంగులను నిర్మిస్తున్నామని సమితి ప్రతినిధులు ప్రకటించారు.

### రెండేళ్లలో పూర్తి చేస్తాం



తాండూరు హిందూ ఉత్సవ సమితికి కేటాయించిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేశారు. దీంతో గుంతలమయంగా మారిన భూమిని చదును చేస్తున్నాం. తర్వాత చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తాం. మొత్తం పనులను రెండేళ్లలో పూర్తి చేస్తాం.

– పట్లోళ్ల నర్సింహులు, ప్రధాన కార్యదర్శి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి

# ఆయిల్‌పాం సాగుతో లాభాలు

పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్‌ చైర్మన్‌

పూడూరు: ఆయిల్‌ పాం పంటను సాగు చేసి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలతో పాటు అధిక లాభాలు పొందాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ పట్లోళ్ల సతీష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌ పాం సాగుపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగుపై ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌ పాం సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉద్యానశాఖ అధికారి ఎంఏ సత్తార్‌ మాట్లాడుతూ.. ఆయిల్‌పాంతో పాటు అంతర పంటలు వేసి మంచి లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు. పంటపై దొంగల, దళారి, కోతుల బెడద ఉండదని నేరుగా పొలానికే కంపెనీలు వచ్చి కొనుగోలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, ఎంపీడీఓ పాండు, అధికారులు డాక్టర్‌ రంగనాయకులు, తులసీరాం, వైజయంతి, కమల తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల సూచనలు పాటించాలి



రాపోల్‌లో పంటలు పరిశీలిస్తున్న ఏఓ

పరిగి: రైతులు సాగు విషయంలో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రజిత సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రాపోల్‌లో పర్యటించి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సాగు చేసిన పంట అధిక దిగుబడి రావాలంటే రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఏవైన చీడ పురుగులు వ్యాపిస్తే వెంటనే మందులను పిచికారీ చేయాలని సూచించారు. పంట సాగులో ఎలాంటి సందేహాలు ఉన్న వెంటనే రైతు వేదికలో ఉన్న అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శశాంక్‌, యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్‌, వెంకటేష్‌, పెంటయ్య, కలీ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే లక్ష్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: పేదల సంక్షేమానికి కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ అండగా ఉంటుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ సంబంధించి 33 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్‌ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవర వెంకట్‌రెడ్డి, ఎం.క్రిష్టారెడ్డి, సున్నపు వసంతం, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, శంకర్‌, రాములు, పెంటయ్యగౌడ్‌, నరేందర్‌, పాండు, శ్రీనివాస్‌గౌడ్‌, మహేందర్‌ముదిరాజ్‌, సురేందర్‌, చెన్నయ్య, మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఉపాధ్యాయ ఆత్మీయ సన్మానం

మల్కాపూర్‌ సమీపంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన సదస్సు నిర్వహించనున్నట్లు, ఈ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు.

## నేడు దుద్యాల్‌కు ఎంపీ డీకే అరుణ

దుద్యాల్‌: మండల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా శనివారం చేపట్టే ధర్నాలో మహబూబ్‌నగర్‌ ఎంపీ డీకే అరుణ పాల్గొననున్నట్లు మండల బీజేపీ నాయకుడు శ్రీకాంత్‌, ఫార్మా బాధితులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని పులిచెర్ల గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఫార్మా బాధిత రైతులతో మాట్లాడారు. అన్నదాతలు అధైర్య పడొద్దని చెప్పారు.

## 9న ఫార్మాకు వ్యతిరేకంగా పాదయాత్ర

దుద్యాల్‌: ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా కొడంగల్‌ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఈ నెల 9న మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు బీఆర్‌ఎస్‌ దుద్యాల యూత్‌ అధ్యక్షుడు బోగమోని సురేశ్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని హకీంపేట్‌, పోలేపల్లి, లగచెర్ల, రోటిబండ తండా, పులిచెర్ల తండా గ్రామాల్లో ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంతో కొన్ని రోజులుగా ఆయా గ్రామాల రైతులు ఆందోళన చేపడుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో పోరాటం ఉధృతం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మహా పాదయాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



యజమానికి నోటీసు ఇస్తున్న ఇన్‌చార్జి ఎంపీఓ

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా అధిక అంతస్తులతో భవనాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్‌గౌడ్‌ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తుండటంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తే కఠినచర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీరొక్క పూలతో సంబరాలు



తాండూరుటౌన్‌: ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు



అనంతగిరి: బతుకమ్మతో మహిళలు



వికారాబాద్‌లో బ్రహ్మకుమారీస్‌ ఆధ్వర్యంలో..



తాండూరుటౌన్‌: బతుకమ్మతో మహిళలు

తాండూరు టౌన్‌: రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని తాండూరు పట్టణంలోని శాలివాహన డిగ్రీ కళాశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు ఆడి పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి, వక్తగా విచ్చేసిన ఏఈ నందినీరెడ్డి, శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ శరత్‌చంద్ర, అకాడమిక్‌ డైరెక్టర్‌ లింగయ్య, డైరెక్టర్లు రాధాకృష్ణ, వీరేందర్‌, లక్ష్మారెడ్డి, మాధవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భగీరథ సరఫరాలో ఇబ్బందులొద్దు

ఎస్‌ఈ ఆంజనేయులు



బంట్వారంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ

పరిగి: మిషన్‌ భగీరథ నీటిలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఈఈ చల్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జాఫర్‌పల్లి నీటి శుద్ధి కేంద్రంలో సీఈ చంద్రమౌళితో కలసి భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్‌ భగీరథలో మూడు రోజులుగా సిబ్బందికి పలు రకాల శిక్షణలు ఇస్తున్నామని, చివరి రోజు కావడంతో నీటి సమస్యలు ఏ గ్రామంలో రాకుండా చూడాలని సూచించామన్నారు. ఎప్పటికప్పులు ప్లాంటు శుద్ధి నిర్వహించి ప్రజలకు స్వచ్ఛమైనం నీటిని అందించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన సిబ్బందిపై చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో దోమ ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ సోమలింగం, డిప్యూటీ ఈఈ సుబ్రమణ్యం, ఏఈ కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

### నీరు స్వచ్ఛమైనది

బంట్వారం: మిషన్‌ భగీరథ నీరు ఎంతో స్వచ్ఛమైనదని ఎస్‌ఈ ఆంజనేయులు అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన నీటి సహాయకుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ప్రజలకు మంచి నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో మిషన్‌ భగీరథ గ్రిడ్‌ డీఈ విజయ్‌కుమార్‌, ఎంపీడీఓ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ వేణుమాధవ్‌, నీటి సహాయకులు పాల్గొన్నారు.



పరిగి: సర్టిఫికెట్లు అందుకున్న సిబ్బందితో ఈఈ చల్మారెడ్డి

## గాజీపూర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు

పెద్దేముల్‌: ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని పెద్దేముల్‌ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్‌ ఆకాంక్షించారు. శుక్రవారం మండలంలోని గాజీపూర్‌లో కాంగ్రెస్‌ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌ఎన్‌ఆర్‌ యువసేన సహకారంతో వికారాబాద్‌ మహావీర్‌ జనరల్‌ ఆస్పత్రి నేతృత్వంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారన్నారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, నజీర్‌, మహేశ్‌, సుధాకర్‌, ఇబ్రహీం, నరేందర్‌, లాల్‌రెడ్డి, రాములు, రాంరెడ్డి, వైద్యులు సంకీర్తన, సాయిస్మరణ, స్వరోచిత, అతుల్‌, మతిన్‌, సిబ్బంది శ్రీకాంత్‌గౌడ్‌, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ అనంతరమే నియామకాలు

ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చెంచు సంఘం నాయకులు

కుల్కచర్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసిన అనంతరమే డీఎస్సీ నియామకాల ప్రక్రియ చేపట్టాలని ఆదివాసీ చెంచు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన సంఘం నాయకులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌ మురళీధర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పూర్తయితే చెంచు ప్రజలకు ఉద్యోగ అవకాశాల్లో ఊరట లభిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్లో పేర్కొన్న విధంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పూర్తయిన అనంతరమే కొత్త నియామకాలు చేపట్టాలన్న మాటకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.రాములు, అరవింద్‌, కె.రాములు, మహేందర్‌, తిరుపతి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి వైభవం.. భక్తుల పరవశం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గాయత్రీ, అన్నపూర్ణదేవిగా వివిధ రూపాల్లో అమ్మవారు శుక్రవారం ఆయా చోట్ల దర్శనమిచ్చారు. అనంతరం నైవేద్యం సమర్పించి భక్తిని చాటుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మండపాల్లో కొలువైన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. వికారాబాద్‌లోని శ్రీ లక్ష్మి అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



అనంతగిరి: ఊరేగుతున్న స్వామివారు



ధారూరు: గాయత్రీదేవి అవతారం

## స్వామి వారికి వాహన సేవ

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం ఆలంపల్లిలో వెలిసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. సాయంత్రం ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని హనుమత్‌ వాహనంపై ఊరేగించారు.



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో దుర్గామాత మండపం



కుల్కచర్ల: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



దుద్యాల్‌: పోలేపల్లి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



ధారూరు: అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్‌-9573005622